క్లుప్తంగా

శ్రీమత్స్యగిరి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీలను శనివారం ఆలయ అధికారులు లెక్కించారు. 2నెలల 21రోజులకు గాను రూ.8,20,040 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మోహన్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ నిఖిల్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన శంకరమ్మ



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శంకరమ్మ

మోత్కూరు : తెలంగాణ మలిదశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.

రామన్నపేటలో రన్ ఫర్ జీసస్



కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

రామన్నపేట : మండల కేంద్రంలో క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పల్లివాడ నుంచి మండల కేంద్రంలోని జాయిన్ గాస్పెల్ చర్చి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు క్రీస్తు బోధనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కేఎస్ పాల్, రేపాల ప్రకాష్, విద్యాసాగర్, జేమ్స్, అబ్రహం కుమార్, బి.ప్రభువరకుమార్, కిష్టఫర్, స్వర్ణలత, పి.సుశీల, ప్రోగ్రాం కన్వీనర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా దశరథ



దశరథకు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

ఆలేరురూరల్ : పట్టణానికి చెందిన తునికి దశరథ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి సురేష్, అశోక్, నంద గంగేష్, కృష్ణ, శ్రీను, సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా భాస్కర్

భువనగిరి : బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా ఉడుత భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ నియామకపత్రం అందజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని ఆయన భాస్కర్ తెలిపారు.

బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం మహిళలు బోనాలతో ప్రదర్శనగా వచ్చి బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ముందుగా దిష్టి కుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి ముసుగు

రామన్నపేట : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మండల కేంద్రంలో గల ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి ముసుగు వేయడమే అందుకు నిదర్శనం. లక్ష్మణ్‌బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడు, చేతి వృత్తిదారుల ఆరాధ్యుడు, తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించారని, వెంటనే ఆయన విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మా ప్లాట్లు మాకు ఇప్పించండి

యాదగిరిగుట్ట రూరల్ : తమకు విక్రయించిన ప్లాట్లను మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని న్యాయం చేయాలని హైదరాబాద్‌కు చెందిన శ్రీ విరాట్ మార్కెటింగ్ ఇన్వెస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ ఖదీర్‌తో పాటు మరికొందరు బాధితులు కోరారు. శనివారం వారు యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడారు. విరాట్ ఎన్‌క్లేవ్ వెంచర్ ఎండీ శ్రీనివాసులు యాదగిరిగుట్ట మండలంలోని కాచారం, తాళ్లగూడెం, బాహుపేట, పెద్దకందుకూరు గ్రామాల్లో సుమారు 80 ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేశాడు. దాదాపుగా 1,500 ప్లాట్‌లు చేసి విక్రయించినట్లు తెలిపారు. నాతో పాటు చాలా మంది వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామని, తిరిగి అదే ప్లాట్లను మాకు తెలియకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశాడని, తమ ప్లాట్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్ ఫిర్యాదు చేశామని, వెంచర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'డబుల్' ఇళ్లు అందేదెప్పుడో..?

- నిర్మాణాలు పూర్తైనా లబ్ధిదారులకు అందని ఇళ్లు
- కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు



వంగపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

యాదగిరిగుట్ట రూరల్ : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డబుల్ ఇళ్ల నిర్మాణాలను నత్తనడకన సాగిస్తూ సకాలంలో పూర్తి చేయకపోవడమే కాకుండా, కనీసం పూర్తైన ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించడంలో విఫలమైంది. దీంతో గూడు లేని నిరుపేదలకు ఇళ్లు వస్తాయని ఎదురుచూసిన వారికి నిరీక్షణ తప్పడం లేదు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది. కాని నేటికి వాటిని లబ్ధిదారులకు అందించడంలో జాప్యం చేసింది. ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పి అప్పట్లో గ్రామంలో అధికారులు గ్రామ సభ నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితాను తయారు చేశారు. కానీ ఎంపికైన లబ్ధిదారులకు నేటికి ఇళ్లు అందించకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. తమకు వచ్చిన ఇళ్లను అప్పగించాలని సొంత ఇంటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన ఇళ్లలో, అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ ప్రభుత్వమైనా స్పందించి తమకు కేటాయించిన ఇళ్లను అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.201.60లక్షలతో నిర్మాణాలు..

వంగపల్లి గ్రామంలో రెండు పడక గదుల గృహ సముదాయ నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.201.60లక్షలతో 40ఇళ్లను నిర్మించింది. వెంటనే ఇళ్లను 40మంది లబ్ధిదారులకు కూడా గ్రామ సభ ద్వారా కేటాయించింది. కానీ వాటిని ఇంకా అర్హులైన వారికి అప్పగించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. అదే విధంగా ఇళ్ల సముదాయంలో పలు మౌలిక వసతులు కల్పించాల్సి ఉందని వెంటనే పనులు పూర్తి చేసి అందించాలని వంగపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం



గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను తీసుకునేందుకు చాలా సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో మాకు ఇళ్లు ఇవ్వడానికి గ్రామసభలో ఎంపిక చేశారు. కానీ దాదాపుగా సంవత్సరం దాటినా మాకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించలేదు. ఇంకా కొన్ని పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేసి ఇళ్లను అప్పగించాలి.

– తాటిపాముల అశోక్‌గౌడ్, లబ్ధిదారుడు, వంగపల్లి

అద్దెలు చెల్లించలేకపోతున్నాం



నిరుపేదలకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. మాకు రెండు పడకల గదిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులు ఎంపిక చేశారు. కానీ ఇప్పటికీ అప్పగించలేదు. అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నాం. ప్రతినెలా అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నాం. మాకు వెంటనే డబుల్ ఇళ్లను అప్పగించేలా చర్యలు తీసుకోవాలి.

– కొట్టూరు శివశంకర్, లబ్ధిదారుడు, వంగపల్లి

కలెక్టరేట్‌లో మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న ఐకేపీ, ఏపీఎం, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు

భువనగిరిటౌన్ : పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీఓ ఐకేపీ సిబ్బంది, ఏపీఎం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలిసి మానవహారం చేపట్టారు. అంతకు ముందు వారంతా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకుంటాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ.కృష్ణన్, అడిషనల్ పీడీ శ్రీనివాస్, డీపీఎం సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఆస్తిపన్ను వసూళ్ల గడువు

భువనగిరిటౌన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు మున్సిపాలిటీల్లో చేపట్టిన ఆస్తిపన్ను వసూళ్ల గడువు ఆదివారంతో ముగియనుంది. ఇప్పటి వరకు భువనగిరి మున్సిపాలిటీలో 70.29శాతం పన్ను వసూళ్లు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.723.09లక్షలు డిమాండ్ కాగా రూ.508.03లక్షలు వసూళ్లు చేశారు. మిగిలిన ఒక రోజు 100శాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆస్తి పన్ను బకాయిలపై పడిన వడ్డీపై 90శాతాన్ని మాఫీ చేస్తూ ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పించడంతో అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి శనివారం తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపునకు ఇక ఒక్కరోజు గడువు ఉండడంతో ఆదివారం కూడా కౌంటర్‌లు తెరిచి ఉంటాయని తెలిపారు.

ఫోన్‌పే ద్వారా చెల్లించొద్దు..

కొంత మంది ఫోన్ చేసి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించాలని కోరుతున్నట్లు దృష్టికి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఎవరు కూడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆస్తి పన్ను చెల్లింపు చేయొద్దని నేరుగా మున్సిపాలిటీ కార్యాలయంలో కాని, మీ సేవా కేంద్రంలో, మున్సిపాలిటీ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు మాత్రమే చెల్లింపు చేయాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- జెడ్పీ సీఈఓ శోభారాణి



తుర్కపల్లి : బద్దూతండాలో ట్యాంకును పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ శోభారాణి

తుర్కపల్లి : వేసవి సమీపిస్తున్నందున గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని జెడ్పీసీఈఓ ఎన్.శోభారాణి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని బద్దుతండ, అవాస ప్రాంతలైన చోక్లతండా, తుల్చియా తండాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంకులను, తండాల్లో తాగునీటికి వినియోగిస్తున్న బోర్ బావులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తాగునీటి సమస్యను తీర్చడానికి గ్రామాల్లో, తండాల్లో బోర్‌బావులు ఎండిపోతే, ఇతర బోర్‌లు లీజ్‌కు తీసుకొని తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఏటీఆర్‌డీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

భువనగిరి రూరల్ : వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని అనంతారంలో తాగునీటి బోరు, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



ఆత్మకూరు(ఎం) : మాక్ పోలింగ్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న విద్యార్థిని



బొమ్మలరామారం : మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆత్మకూరు(ఎం) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా విద్యా శాఖ ఆదేశానుసారం మండలంలోని పల్లెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి దొడ్డి స్వామి మాట్లాడారు. విద్యార్థులకు మాక్ పోలింగ్‌తో ప్రజాస్వామ్యం, ఎన్నికలపై అవగాహనకు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాక్ ఎలక్షన్ ఇన్‌చార్జ్ మజ్జిగ లక్ష్మన్, ఉపాధ్యాయులు వెంకట్‌నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, షమీం, శిరీష రాణి, వెంకటేషం, కలీం, రవీందర్ పాల్గొన్నారు.

నాగినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

బొమ్మలరామారం : మండలంలోని నాగినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో డీఈఓ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వడ్డేపల్లి గిరీష్‌కుమార్, గోదుమకుంట వెంకటేశం, కత్తుల జగన్, దూకుంట సైదులు, మండల స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటకొండూర్ పాఠశాలలో..

మోటకొండూరు : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో హెచ్‌ఎం బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాక్ పోలింగ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఎన్నికలు జరిగే విధానంపై విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ గండమల్ల విశ్వరూపం, ఉపాధ్యాయులు అచ్చంట భాగ్యశ్రీ, భూమండ్ల సత్యనారాయణ, సంగు శ్రీను, మంచాల పురుషోత్తం, అఫ్జల్, సుల్తాన, అండాలు, రేణుక, ఏఎస్ఐ రవికుమార్, డబ్ల్యూపీసీ కె.భవానీ పాల్గొన్నారు.



మోటకొండూరులో మాక్ పోలింగ్.

జిల్లాలోని సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

బీబీనగర్ : భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే జిల్లాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాలను బలపరుస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడే సీపీఎంను ప్రజలు ఆదరించాలని, ఈసారి ఎంపీ ఎన్నికల్లో సీపీఎంకు ఓటు వేయాలని కోరారు. జిల్లాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, పార్లమెంట్‌లో గళం విప్పే సరైన వ్యక్తి లేక స్థానికంగా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. మూసీ ప్రక్షాళన జరగాల్సిన అవసరముందని, కాలుష్యం లేని సాగునీరు రైతులకు అందించాలన్నారు. బస్వాపురం ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, అనురాధ, జిల్లా నాయకులు మాటూరి బాల్‌రాజు, వెంకటేష్, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, ఉమర్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న వేదపండితులు

వలిగొండ : మండలంలోని మాందాపురంలో ప్రవాస భారతీయులు సోలిపురం ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు సోలిపురం వెంకట్‌రెడ్డి, డాక్టర్ రంజిత్‌రెడ్డి సౌజన్యంతో నిర్మించిన శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వేదపండితులు స్వామి వారి కల్యాణాన్ని వేద మంత్రోచ్చరణల నడుమ కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను రథంపై వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సోలిపురం సాగర్ రెడ్డి, సోలిపురం రాంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకళ, చెన్నారెడ్డి, రాములు, భక్తులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గుండు వెంకటనర్సు

మోత్కూరు : వేసవికాలం తీవ్రమైనందున గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటి వట్టిపోయాయని, తాగునీటి సమస్య జఠిలమవుతుందని, ముందస్తుగానే నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి బోర్లు వేయడం, ప్రైవేట్ వ్యక్తుల బోర్లను లీజుకు తీసుకొని తాగునీటి సరఫరా చేయాలని, పైపులైన్‌లను, ఓవర్‌హెడ్ ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు పానుగుల్ల రమేష్, దడిపల్లి ప్రభాకర్, ఎన్నం వెంకట్‌రెడ్డి, కొంపెల్లి గంగయ్య తదితరులున్నారు.

ఎన్నికలకు సహకరించాలి

భువనగిరి క్రైం : రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి సాయిబాబ గుడి వరకు నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకుందామన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐలు నాగరాజు, అరుణ్‌కుమార్, వీరస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ రవికిరణ్‌రెడ్డి

షెడ్డు నిర్మాణానికి విరాళం



ఈఓకు విరాళం అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వేసవిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా షెడ్డు నిర్మాణానికి శాసనమండల ప్రోటెం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి శనివారం రూ.11లక్షల విరాళాన్ని ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు. అంతకు ముందు గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట శాసనమండలి మాజీ చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఐలయ్య

తుర్కపల్లి : మత సామరస్యానికి ప్రతిక రంజాన్ అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాసంలో ముస్లింలు జరుపుకునే ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. భారతదేశంలో హిందూ, ముస్లింలు కలిసిమెలిసి ఉండాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మజీద్‌లకు తన వంతు సహకారం అందించి అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, నాయకులు రాజయ్య, మహిపాల్‌రెడ్డి, రాజారాంనాయక్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు ఘన సన్మానం



డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారిని సన్మానిస్తున్న వైద్య ఉద్యోగులు

భువనగిరి : పట్టణంలో డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ అమోస్ హాజరై మాట్లాడారు. అంకిత భావంతో పనిచేస్తే వృత్తి రీత్యా మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని, కాని వృత్తిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పుడే దానికి సార్థకత ఉంటుందన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, సూర్యాపేట జిల్లా డీఎంహెచ్‌ఓ కోటాచల్లం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు హర్షవర్ధన్, శిల్పిని, యశోద, సుమన్‌కళ్యాణ్, వంశీకృష్ణ, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ముగిసిన పదోతరగతి పరీక్షలు



పరీక్షా కేంద్రం వద్ద ఆనందంలో విద్యార్థులు

చౌటుప్పల్ : ఈనెల 18న ప్రారంభమైన పదోతరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయి. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాలలో 1260మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షలు ముగియడంతో గురుకులం, వివిధ హాస్టళ్లలోని విద్యార్థులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. పరీక్ష ముగియడంతో విద్యార్థులు ఆనందంతో చిందులు వేస్తూ ఒకరికొకరు వీడ్కోలు తెలుపుకున్నారు.

శ్రీతిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల పురాతన శ్రీతిరుమలనాథ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి ఏప్రిల్ 9వరకు 10రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మచ్చ శ్రీదేవి చంద్రమౌళిగౌడ్, మచ్చ శ్రీనివాస్‌గౌడ్, తాజా మాజీ సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ రాగుల బల్‌రామ్, ఆలయ అర్చకులు కాండూరి లక్ష్మీనర్సింహచార్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

భూదాన్‌పోచంపల్లి : రైతులకు రూ.2లక్షలలోపు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు పగిళ్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, జంగయ్య పాల్గొన్నారు.

పార్టీకి ద్రోహం చేసినందుకే అవిశ్వాసం

సంస్థాన్ నారాయణపురం : బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ పార్టీని ద్రోహం చేసినందుకు ఎంపీపీ గుత్త ఉమాదేవిపై అవిశ్వాసం పెట్టినట్లు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు శనివారం తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు అవిశ్వాసానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

బీమ్ యాత్రను విజయవంతం చేయాలి

భువనగిరిటౌన్ : మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 14న నిర్వహించే బీమ్ యాత్రను విజయవంతం చేయాలని యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో యువజన సంఘాలు, విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, నాయకులు పట్నం కపిల్, వనం రాజు, మంగ ప్రవీణ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని కొర్రతండాకు చెందిన కె.లచ్చు, కొర్ర వినోద్ తమ సెల్‌ఫోన్‌ను నెల రోజుల క్రితం పోగట్టుకున్నారు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుని శనివారం ఎస్ఐ జగన్ బాధితులకు అప్పగించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'ఆట, పాటల విద్య'

గుండాల : మండలంలోని వస్తాకొండూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆట, పాటల విద్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీసీడీఈ (ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డే)ను నిర్వహించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల విద్యార్థుల ప్రతిభా పాటవాలను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్ భేగం, అంగన్‌వాడీ టీచర్లు యాట రమ, ఎల్.పద్మ, ఎండీ.గుల్జార్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠ

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని గుజ్జ గ్రామంలో గల శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభం, శివలింగం, గణపతి, కుమారస్వామి, అభయాంజనేయస్వామి విగ్రహాలను శనివారం ప్రతిష్ఠించారు.

అక్రమ వసూళ్లను అరికట్టాలి

గుండాల : గ్రామాల్లో కిరాణషాపుల యజమానులు ప్రజల నుంచి అక్రమంగా దోచుకుంటున్న సొమ్మును అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కిరాణషాపులు, జనరల్ స్టోర్‌లను నిర్వహిస్తున్న నిర్వాహకులు నిత్యావసర సరుకులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వినియోగదారుల ఫోరం ఉన్నప్పటికీ ఏమీ చేయలేకపోతున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

నరేందర్‌రాయుడు మృతికి నివాళి

మోత్కూరు : మండల కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు దేవినేని నిర్మల భర్త, రిటైర్డ్ తహసీల్దార్ దేవినేని నరేందర్‌రాయుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో నరేందర్ రాయుడు మృతదేహాన్ని బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పలువురు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం అందజేత

రాజాపేట : మండల కేంద్రానికి చెందిన నిరుపేద నేత కార్మికుడు సామల దత్తాత్రేయ మృతి చెందాడు. శనివారం పద్మశాలి సంఘం, గ్రామ యువత ఆధ్వర్యంలో దాతల సహకారంతో బాధిత కుటుంబానికి రూ.35వేల నగదు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులతో పాటు ఎంపీటీసీ రాజు, గ్రామ యువకులు కోయ మధు, దాచపల్లి శ్రీను, బోగ జ్ఞానేందర్, చుంచు నారాయణ పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు తప్పక గుర్తింపు

రామన్నపేట : భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ఆలస్యమైనా తప్పకగుర్తింపు, గౌరవం లభిస్తుందని డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి తాటిపాముల శేఖర్‌గౌడ్ తెలిపారు. శనివారం ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆయన హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.